



త్యాగాలకు ప్రతీక



శిలువపై విశ్వాసుడి ప్రదర్శన

త్యాగాలకు ప్రతీక గుడ్ ఫ్రైడే. జిల్లావ్యాప్తంగా శుభ శుక్రవారాన్ని క్రైస్తవులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. విశ్వాసులు శిలువను మోస్తూ ప్రదర్శనలు జరిపారు. క్రీస్తు త్యాగాన్ని గుర్తు చేసుకుని ఆయన శిలువపైన పలికిన చివరి ఏడు మాటలను పాస్టర్లు వివరించారు. 8లో



తాడేపల్లిగూడెంలో, శిలువను మోస్తూ.. గీతాలాపన

5,68,545

పశ్చిమలో ఉపాధి లేని వారి సంఖ్య

- జిల్లాలో వర్క్ ఫ్రం హోమ్‌పై రాష్ట్ర ప్రభుత్వ సర్వేలో వెల్లడి
- 18 నుంచి 50 ఏళ్లలోపు 9,74,131 మంది నుంచి వివరాల సేకరణ
- ఉద్యోగాలు చేస్తున్నవారు 2,69,132 మంది

భీమవరం టౌన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):పశ్చిమ గోదావరి జిల్లాలో ఐదు లక్షల 68 వేల 545 మందికి ఎలాంటి ఉపాధి లేదు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వర్క్ ఫ్రం హోం సర్వేలో ఈ విషయం వెల్లడైంది. వర్క్ ఫ్రమ్ హోమ్ కల్చర్‌ను విస్తరిం చాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులతో ఫిబ్రవరి నుంచి దీనిని నిర్వహిస్తోంది. వారు ఉద్యోగం చేస్తున్నారా ? లేదా ? చేస్తే ఏ ఉద్యోగం ? ఏ కంపెనీ మొదలైన వివరాలు నమోదు చేసింది. జిల్లాలో 4,45,171 గృహాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు వారి నుంచి వివరాలను సేకరించింది. వీరు మొత్తం 9,75,702 మంది ఉండగా 9,74,131 మందిని సర్వే చేశారు. 1,571 మందిని సర్వే చేయాల్సి ఉండగా, వారు అందుబాటులో లేకపోవటం, సర్వేకు సమాచారం ఇవ్వకపోవటం వల్ల పెడింగ్‌లో ఉంది. వీరి నుంచి సమాచారం సేకరించి నూరు శాతం సర్వే పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సర్వేలో ఉద్యోగాలు లేని వారు ఐదు లక్షల 68 వేల 545 మంది, ఉద్యోగాలు చేస్తున్న వారు రెండు లక్షల 69 వేల 132 మంది. ఉన్నారు. ఈ నివేదికను జిల్లా అధికారులు ప్రభుత్వానికి అందించారు.



సర్వే గణాంకాలు.. మండలాల వారీగా..

మండలం	జనాభా	సర్వే చేసింది	ఉద్యోగులు	నిరుద్యోగులు
ఆచంట	31,120	31,065	4,492	15,753
ఆకివీడు	38,709	37,861	8,061	18,995
అత్తిలి	35,722	35,658	9,111	23,480
భీమవరం(రూ)	46,466	46,431	9,255	30,307
భీమవరం(అ)	72,025	71,947	19,856	30,467
యలమంచిలి	37,413	37,399	9,518	23,863
ఇరగవరం	34,938	34,924	11,632	21,372
కాళ్ళ	37,498	37,476	9,574	23,336
మొగల్తూరు	40,488	40,471	7,138	28,084
నరసాపురం(రూ)	43,758	43,749	15,424	24,999
నరసాపురం(అ)	29,381	29,285	6,545	15,046
పాలకోడేరు	35,232	35,221	9,306	19,665
పాలకొల్లు(రూ)	36,851	36,845	10,872	23,584
పాలకొల్లు(అ)	33,117	33,099	10,786	16,773
పెంటపాడు	37,826	37,798	9,382	25,030
పెనుగొండ	37,954	37,930	8,830	22,432
పెనుమంట్ర	30,987	30,945	7,580	19,789
పోడూరు	34,232	34,218	7,749	20,875
టీపీ గూడెం(రూ)	48,769	48,741	12,325	23,480
టీపీ గూడెం(అ)	53,290	53,215	13,795	24,228
తణుకు (రూ)	32,083	32,065	8,791	19,914
తణుకు(అ)	46,850	46,818	14,257	22,660
ఉండి	33,747	33,720	7,857	20,986
వీరవాసరం	34,247	34,226	6,739	24,408
	9,75,702	9,74,131	2,69,132	5,68,545



మొదటి బహుమతి విజేత గోపాల కృష్ణకు బైక్‌కు సంబంధించిన చెక్‌ను అందజేస్తున్న బ్రాంచి మేనేజర్ బి.హరిబాబు, ఏపీఎం కృష్ణ

ఆంధ్రజ్యోతి తెచ్చిన అదృష్టం

కార్ అండ్ బైక్ రేస్ జిల్లా విజేతలకు బహుమతులు పంపిణీ

ఫస్ట్ ప్రైజ్ బైక్, రెండోది ఫ్రిజ్, మూడో ప్రైజ్ టీవీ

వంద మందికి కన్సొలేషన్ బహుమతులు..

విజేతల ఆనందం.. ఆంధ్రజ్యోతికి కృతజ్ఞతలు 7



ఈకేవైసీతో బినామీలకు చెక్

సహకార సంఘాల్లో 80 శాతం పైగా పూర్తి

త్వరలో బినామీలు, డెత్ కేసుల్లో ఓట్ల ఏరివేత

ఇకపై అర్హులకే ఓట్లు 7



పేదలకు అధికార భాగస్వామ్యం

ఇదే జనసేన అధినేత పవన్ లక్ష్యం : మంత్రి కందుల దుర్గేశ్

7

నరసాపురం నగల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు.. తూకంలో తేడాలు.. జరిమానా

పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం, మొగల్తూరు మండలాల్లో 19 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా జిల్లాల్లో కలిపి మొత్తం విస్తీర్ణం 140 కిలోమీటర్లు. ఈ ప్రాంతాల్లో కాకినాడ, మచిలీపట్నం ప్రాంతాలు పారిశ్రామికంగా అభివృద్ధి చెందినా.. పశ్చిమ ఇందుకు భిన్నంగా ఉంది. వందల ఎకరాల స్థలాలు, రహదారులు, రైలు మార్గాలు వంటి మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్నప్పటికి పారిశ్రామికంగా వెనుకబడే వుంది. గతంలో కేంద్ర మంత్రులుగా పనిచేసిన కృష్ణంరాజు, దాసరి నారాయణరావు పరిశ్రమల ఏర్పాటుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ కారణంగా తీర ప్రాంతంలో కోస్టల్ కారిడార్ కలగానే మిగిలింది. తాజాగా కేంద్ర మంత్రి వర్మ ఆ దిశగా అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది.

పరిశ్రమిద్దాం

మళ్లీ తెరపైకి కోస్టల్ కారిడార్

- పరిశ్రమల ఏర్పాటుకు ముమ్మర ప్రయత్నాలు
- జాతీయస్థాయిలో కేంద్ర మంత్రి వర్మ మంతనాలు

నరసాపురం, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాల్లోని ఎన్‌డీఏ ప్రభుత్వాలు పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద పీట వేస్తున్నాయి. ప్రస్తుతం కేంద్ర పరిశ్రమల శాఖ సహాయ మంత్రిగా శ్రీనివాసవర్మ వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంపై ఆయనకు మంచి పట్టు ఉంది. ఇక్కడ ఉన్న మౌలిక వసతులు, వనరులపై అవగాహన ఉన్న కేంద్ర మంత్రి ఎలాగైనా తీరంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని దృఢ నిశ్చయంతో ఉన్నారు. నరసాపురం, మొగల్తూరు ప్రాంతాల్లో సుమారు 19 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. వందల ఎకరాల సీఆర్‌జెడ్ భూములు ఉన్నాయి. మౌలిక వసతుల విషయానికి వస్తే 216 జాతీయ రహదారి తీరం వెంబడే వెళుతుంది. ఇటు రైల్వేస్టేషన్ త్వరలో జంక్షన్‌గా మారబోతుంది. నరసాపురం నుంచి విజయవాడ, ఇటు భీమవరం నుంచి విశాఖపట్నం వరకు డబ్లింగ్ లైన్ విస్తరించింది. కాకినాడ పోర్టు 70 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇటు మచిలీపట్నం పోర్టు పూర్తయితే ఈ దూరం మరింత దగ్గరవుతుంది. ఇన్ని మౌలిక వసతులువున్న ఈ ప్రాంతం కోస్టల్ కారిడార్‌కు అన్నివిధాలుగా అనుకూలమైన ప్రతిపాదనను తెరమీదకు తీసుకొచ్చారు. పారిశ్రామిక వేత్తలకు ఈ ప్రాంతంపై అవగాహన కల్పించి కనీసం ఒక్క పరిశ్రమనైనా తీసుకొచ్చేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి ఆహ్వానం మేరకు నరసాపురం ఎమ్మెల్యే నాయకర్ ఢిల్లీ వెళ్లారు. అయితే ఏ పరిశ్రమను తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్న దానిపై మాత్రం బయటకు వెల్లడించడం లేదు.

> కేంద్ర పరిశ్రమల మంత్రి హోదాలో శ్రీనివాసవర్మ ఏదో ఒక్క పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేయించగలరన్న నమ్మకం తీర ప్రాంత వాసుల్లో నెలకొంది. ఇదే జరిగితే.. తీర ప్రాంతం కారిడార్‌గా అభివృద్ధితోపాటు నిరుద్యోగులకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు దొరుకుతాయి.

గతంలో హామీలకే పరిమితం

నరసాపురం తీర ప్రాంతం కేజీ బేసిన్‌కు కేంద్రంగా నిలిచింది. 1977లో ఈ ప్రాంతంలో గ్యాస్, ఆయిల్ నిక్షేపాలు బయట పడ్డాయి. వీటిని వెలికి తీసేందుకు ఓఎన్‌జీసీ నరసాపురం పట్టణ శివారులో టెంపుల్ ల్యాండ్‌ను ఏర్పాటు చేసింది. ఇక్కడ ఆయిల్ గ్యాస్ తవ్వకాలకు కావాల్సిన సామగ్రికి నిల్వ ఉంచుతారు. కేజీ బేసిన్ కేంద్ర కార్యాలయం మాత్రం రాజమండ్రిలో ఏర్పాటుచేశారు. ఇంత పెద్ద మొత్తంలో గ్యాస్ నిక్షేపాలు బయటపడ్డా ఒక్క పరిశ్రమ కూడా నోచుకోలేదు. చివరికి చమురు శుద్ధి చేసే కర్మాగారమూ కోనసీమ జిల్లాలో ఏర్పాటు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. అది విజ్జేశ్వరం వెళ్లిపోయింది. చివరికి కేంద్ర మంత్రిగా ఉన్న కృష్ణంరాజు పేరుపాలెం ప్రాంతంలో ఆయిల్ శుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేశారు. కానీ అది కూడా ఫలించలేదు. ఆ తర్వాత కేంద్ర కేబినేట్‌లో మంత్రిగా పనిచేసిన దాసరి నారాయణరావు ఈ ప్రాంతంలో థర్మల్ విద్యుత్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించారు. కానీ ఇది ముందుకు సాగలేదు. రాష్ట్ర విభజన తర్వాత ప్రభుత్వం ఈ ప్రాంతంలో ఓడ రేవు కడతామని ప్రకటించింది. సర్వే జరిగింది. అయితే అది నోచుకోలేదు. ఇలా తీర ప్రాంతాన్ని కారిడార్‌గా మార్చేందుకు చేసిన ప్రయత్నాలన్నీ కలగానే మిగిలిపోయాయి.



లెక్క తేలింది..!

- మెగా డీఎస్సీలో 1,035 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఆయా యాజమాన్యాలు, సబ్జెక్టుల వారీగా భర్తీ అయ్యే పోస్టుల సంఖ్యను ఖరారు చేశారు. మొత్తం 1035 పోస్టుల భర్తీకి రాగల రెండు, మూడు రోజుల్లో నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ/జడ్పీ/మండల పరిషత్ యాజమాన్యాల పాఠశాలల్లో మొత్తం 725 పోస్టులను భర్తీచేస్తారు. వీటిలో స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో ఫస్ట్ లాంగ్వేజి 35 పోస్టులు, సెకండ్ లాంగ్వేజి 45, ఇంగ్లీషు 77, గణితం 37, ఫిజికల్ సైన్సు 38, బయోలాజికల్ సైన్సు 58, సోషల్ స్టడీస్ 97, ఫిజికల్ ఎడ్యుకేషన్ 178 పోస్టులు, ఎస్జీటీ కేడర్‌లో 160 పోస్టులను నోటిపై చేయనున్నారు. మున్సిపల్ యాజమాన్య పాఠశాలలకు సంబంధించి నోటిఫై చేయనున్న 310 పోస్టుల్లో ఫస్ట్ లాంగ్వేజి 14, సెకండ్ లాంగ్వేజి 3, ఇంగ్లీషు 8, గణితం 8, ఫిజికల్ సైన్సు 4, బయోలాజికల్ సైన్సు 1, సోషల్ స్టడీస్ 5, పిజికల్ ఎడ్యుకేషన్ 7 పోస్టులు, ఎస్జీటీ కేడర్‌లో 260 పోస్టులను భర్తీచేస్తారు. దీనిపై అధికారిక ప్రకటన విడుదల కావాలి. ప్రత్యేకావసరాలు గల పిల్లలకు బోధించేందుకు కన్వర్షన్ పద్ధతిపై ఇటీవల జిల్లాకు మంజూరైన 166 స్పెషల్ ఎడ్యుకేషన్ స్కూల్ అసిస్టెంట్ కేడర్ పోస్టుల భర్తీకి ప్రత్యేకంగా నియామకాల షెడ్యూలును డీఎస్సీతో సంబంధం లేకుండా తర్వాత విడుదల చేస్తారు.

రూ.14 కోట్లతో దమ్మయ్యపర్తి డ్రెయిన్ పనులు : మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్/పోడూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):నీటిపారుదల శాఖ రూ.14 కోట్లతో చేపట్టిన దమ్మయ్యపర్తి మురుగు నీటి కాలువ పనులను మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు శుక్రవారం పరిశీలించారు. ఇంజనీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. వర్షాకాలంలో ముంపునకు గురవుతున్న పట్టణంలోని 15 వార్డుల సమస్యలకు ఇకపై చెక్ పడినట్లేనని తెలిపారు. నియోజకవర్గంలోని నేరేడుమిల్లి పంట కాల్వ రోడ్డు, రావిపాడు, వద్దిపర్రు, చింతలగర్వులోని పంట కాల్వలు, తాడేరు డ్రెయిన్ గట్లుపై రూ.2.62 కోట్లతో చేపట్టనున్న గ్రావెల్ రోడ్ల నిర్మాణ పనులకు, నేరేడుమిల్లిలో శుక్రవారం మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. అధ్వానంగా ఉన్న కాల్వల రోడ్లపై రైతులు ఎరువులు, ధాన్యాన్ని సైకిళ్లపై కూడా తరలించేలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకపై రైతులు ఆ అవస్థల నుంచి విముక్తి లభించినట్లేనని మంత్రి తెలిపారు. ఎంపీపీ సబ్బితి సుమంగళి, పాలకొల్లు డీసీ చైర్మెన్ పెన్మెత్స రామభద్రరాజు, వైస్ చైర్మన్ దేవళ్ల శ్రీరామకోటి మోహన్, సర్పంచ్‌లు పెన్మెత్స విజయలక్ష్మి, వడ్లపాటి రాజేంద్ర ప్రసాద్, ఎంపీటీసీ విప్పర్తి శారద, మాజీ ఎంపీటీసీ శీలం శ్రీనివాసరావు, ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ పాల్గొన్నారు.



వద్దిపర్రులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పార్కులు అభివృద్ధి చేద్దాం

సహకరించాలని కలెక్టర్ వినతి

తణుకు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):తణుకు పట్టణ పార్కుల అభివృద్ధికి పారిశ్రామికవేత్తలు, దాతలు సహకరించాలని కలెక్టర్ నాగరాణి కోరారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పీ-4 లక్ష్యంగా చేపట్టే పార్కుల అభివృద్ధికి పారిశ్రామిక వేత్తలు, దాతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ పార్కులు, బస్ షెల్టర్స్, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ మాట్లాడుతూ పట్టణ సుందరీకరణ, పార్కుల అభివృద్ధిపై గత నెలలో సీఎం చంద్రబాబు పర్యటనలో ప్రస్తావించారని, రెండు, మూడు నెలల్లో వీటి అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. పారిశ్రామిక వేత్తలు, ఎన్ఆర్ఐలు సహకారం అందించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ పార్కులు, ఖాళీ స్థలాల్లో చేయాల్సిన పనులు, అంచనా వ్యయంపై పవర్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఆంధ్రా షుగర్స్ జీఎం ఎ.సాంబశివరావు, అక్కమాంబ టెక్స్‌టైల్స్ ప్రతినిధులు మొహిద్దీన్, రామకృష్ణ, ఎన్‌కే మెరైన్ ప్రతినిధి శ్రీనివాస్, రాజేష్, దేవీ సీఫుడ్స్ ప్రతినిధులు శివకుమార్, కల్యాణ్, ప్లటస్ టెక్ ల్యాబ్ ప్రతినిధులు ఫణీంద్ర, వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి

పవన్ చెప్పినా కదలని చెత్త

- మొగల్తూరు అభివృద్ధిపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిన డిప్యూటీ సీఎం..
- పలు సమస్యల పరిష్కారానికి పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాలు
- పనులపై వేగం పెంచని జిల్లా యంత్రాంగం
- చెత్తపై ఆదేశాలు ఇచ్చినా.. ఐదు రోజుల్లో తరలించింది 25 లారీలు మాత్రమే

మొగల్తూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి):మొగల్తూరు అభివృద్ధిని సవాల్‌గా తీసుకుని ప్రత్యేక శ్రద్ధతో పరుగులు పెట్టిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశయాలు క్షేత్ర స్థాయిలో అమలు చేయడంలో నిర్లిప్తత కనిపిస్తోంది. గత నెల 28న పవన్ ఆదేశాలతో మొగల్తూరులో గ్రామాభివృద్ధి సభ నిర్వహించిన రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ గ్రామంలోని అన్ని సమస్యలు తెలుసుకుని వెంటనే వాటి పరిష్కారానికి శ్రీకారం చుట్టారు. తొలి ప్రాధాన్యతగా మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ. కోటి 71 లక్షలు మానవవనరుల శాఖ మంత్రి లోకేశ్ ద్వారా గత నెల 30న మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే ఉన్నత పాఠశాలలో అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. రెండో ప్రాధాన్యతగా మొగల్తూరులో జాతీయ రహదారి సమీపంలో ఆక్వా చెరువుల వద్ద కొంత కాలంగా డంప్ చేసిన చెత్తను స్వచ్ఛాంధ్ర టీమ్ నుంచి వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌కు తరలించేందుకు ఉప ముఖ్యమంత్రి పేషీ నుంచి ఆదేశాలు ఈ నెల ఒకటో తేదీన రావడంతో స్థానిక అధికారులు క్షేత్రస్థాయిలో తగు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 2వ తేదీ నుంచి స్వచ్ఛాంధ్ర టీమ్ సభ్యులు రోజుకు ఐదు టిప్పర్ లారీల చొప్పున కేవలం ఐదు రోజులు మాత్రమే చెత్తను నరసాపురానికి తరలించారు. సుమారు 400 టిప్పరు లారీల లోడు గల చెత్త ఇక్కడ డంప్ చేయగా కేవలం 25 లారీలు మాత్రమే తరలించారు. నరసాపురం పురపాలక సంఘం పరిధిలో ఈ చెత్తను ఐదు కేటగిరిలుగా వేరు చేసి స్వచ్ఛాంధ్ర టీమ్ వినియోగంలోకి తీసుకురావాల్సి ఉంది. అయితే పురపాలక సంఘానికి ఈ చెత్తను వేరు చేసే ప్రక్రియకు తగిన ఆదేశాలు లిఖిత పూర్వకంగా లేకపోవడంతో పురపాలక కమిషనర్ అభ్యంతరం వ్యక్తం చేయడంతో మొగల్తూరులో డంప్ చేసిన చెత్త తరలింపు నిలిచిపోయింది. మొగల్తూరులో పేరుకుపోయిన చెత్త తరలింపు సమస్య నిలిచిపోవడంతో ఉప ముఖ్యమంత్రి పేషీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ఆక్వా రైతులు కోరుతున్నారు.



ఆంధ్రజ్యోతి తెచ్చిన అదృష్టం

ఆంధ్రజ్యోతి పాఠకులకు బహుమతుల పంట పండింది. ఏటా నిర్వహించే కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా విజేతలకు బైక్, ఫ్రిజ్, టీవీలను ఆంధ్రజ్యోతి కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్ బి.హరిబాబు శుక్రవారం అందజేశారు. బహుమతులు అందుకున్న విజేతలు ఉబ్బితబ్బిబ్బయ్యారు. తమకు లక్కీడ్రాలో బహుమతులు వరించడం అదృష్టమన్నారు.

- కార్ అండ్ బైక్ రేస్ విజేతలకు బహుమతుల పంపిణీ
- ఉబ్బితబ్బిబ్బయిన విజేతలు
- ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు

పెంటపాడు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి పాఠకుల కోసం నిర్వహించే కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రాలో విజేతలకు బ్రాంచ్ మేనేజర్ శుక్రవారం బహుమతులు అందజేశారు. గత నెల 25న అలంపురం ఆంధ్రజ్యోతి కార్యాలయంలో పాఠకుల నడుమ లక్కీడ్రా ఉత్సాహంగా జరిగింది. తాడేపల్లిగూడెం, తణుకు, గోపాలపురం ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, ఆరిమిల్లి రాధాకృష్ణ, మద్దిపాటి వెంకట్రాజు తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని కూపన్ల నుంచి డ్రా తీసి విజేతలను ఎంపిక చేశారు. కొమ్ముగూడెం గ్రామానికి గోపాలకృష్ణ మొదటి బహుమతి బైక్ సొంతం చేసుకున్నారు. అత్తిలి గ్రామానికి చెందిన లక్ష్మీఅంజలి రెండవ బహుమతి ఫ్రిజ్‌ను అందుకున్నారు. మార్టేరుకు చెందిన నాగభూషణం మూడో బహుమతి ఎల్ఈడీ టీవీ సొంతం చేసుకున్నారు. మరో 100 కన్సొలేషన్ బహుమతులు పాఠకులు అందుకున్నారు. విజేతలకు బీఎం బి.హరిబాబు, ఏసీఎం కృష్ణ బహుమతులను అందజేశారు.



మొదటి బహుమతి విజేత గోపాలకృష్ణకు చెక్, రెండో బహుమతి విజేత లక్ష్మీఅంజలికి ఫ్రిజ్, మూడో బహుమతి విజేత నాగభూషణంకు టీవీ అందజేస్తున్న బీఎం హరిబాబు, ఏసీఎం కృష్ణ

మొదటి బహుమతి గెలుచుకోవడం సంతోషం

ఆంధ్రజ్యోతి పత్రిక సుమారు 20 ఏళ్లుగా చదువుతున్నాను. ఆంధ్రజ్యోతి వార్తలు చదవ డానికి చాలా ఆసక్తిగా ఉంటాయి. కార్ అండ్ బైక్ రేస్‌లో మొదటిసారి పాల్గొన్నాను. నా భార్య అపర్ణ ఆసక్తితో కూపన్లు పంపించాను. తొలి ప్రయత్నంలోనే మొదటి ప్రైజ్ బైక్ రావడం చాలా ఆనందం కలిగించింది. ప్రైజ్ తీసుకునేందుకు వెళ్లినప్పుడు ఆంధ్యజ్యోతి యాజమాన్యం కూడా చాలా బాగా రిసీవ్ చేసుకున్నారు. చాలా సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతికి ప్రత్యేక ధన్యవాదాలు

\- అబ్బిన గోపాలకృష్ణ, ఉప సర్పంచ్, కొమ్ముగూడెం

మాటలు రావడం లేదు.. మా అదృష్టం

చాలా సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పత్రిక చదువుతున్నాం. గత ఐదు సంవత్సరాలుగా కార్ అండ్ బైక్ రేస్‌లో క్రమం తప్పకుండా పాల్గొంటున్నాం. ఇప్పుడు రెండో బహుమతి రావడం చాలా సంతోషంగా ఉంది. మేము బహుమతి సాధిస్తామని అసలు అనుకోలేదు. మాటలు రావడం లేదు ఇది మా అదృష్టం. ఆంధ్రజ్యోతికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతున్నాం. ఆంధ్రజ్యోతిలో వార్తలు చాలా బాగుంటాయి. అన్ని రంగాలవారికి ఉపయోగపడే విధంగా ఉంటాయి.

\- బి.లక్ష్మీఅంజలి, అత్తిలి

కుటుంబంతో ఆనందాన్ని పంచుకున్నాం

నేను గత 18 సంవత్సరాలుగా ఆంధ్రజ్యోతి పేపర్ చదువుతున్నాను. ఆంధ్రజ్యోతిలో వార్తలు చాలా బాగుంటాయి. ఏటా కార్ అండ్ బైక్ రేస్‌లో పాల్గొంటున్నాను. ఈసారి నాకు బహుమతి వచ్చిందని ఫోన్ వచ్చినప్పుడు నాకు కాసేపు మాటలు రాలేదు. చాలా సంతోషపడ్డాను. ప్రైజ్ గెలుచుకున్నం దుకు చాలా ఆనందంగా ఉంది. ఈ ఆనందాన్ని నా కుటుంబసభ్యులు, స్నేహితులతో కూడా పంచుకుంటున్నా. మరోసారి ఆంధ్రజ్యోతికి ధన్యవాదాలు తెలుపుతున్నాను.

\- యూ.నాగభూషణం, మార్టేరు

పేదలకు అధికార భాగస్వామ్యం

ఇదే జనసేన అధినేత పవన్ లక్ష్యం : మంత్రి కందుల దుర్గేశ్

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు అధికార భాగస్వామ్యం కల్పించడం ద్వారా అభివృద్ధి సాధించడం జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లక్ష్యమని మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ నివాసం వద్ద పలువురు వైసీపీ ఎంపీటీలు జనసేన చేరిక సందర్భంగా శుక్రవారం నిర్వహించిన సమావే శంలో ఆయన పాల్గొన్నారు. బయట పార్టీల నుంచి కూటమిలో ఏ పార్టీలో చేర్చుకున్నా అది కూటమి బలోపేతం కోసమేనని స్పష్టం చేశారు. ప్రతీ రైతుకు ధాన్యం విక్రయించిన గంటల వ్యవధిలోనే సొమ్ములు వారి ఖాతాలో జమ కావడం కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పడుతుందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ గత ఐదేళ్ల లో ఎక్కడా రోడ్డువేయలేని స్థితి నుంచి తొమ్మిది నెలల్లో భారీగా రోడ్ల వేసి ప్రజల ఇబ్బందులు సగం తీర్చామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ విధానాల వల్లే ప్రజలు జనసేనకు ఆకర్షితులవుతున్నారని, కూటమి నాయకులంతా అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నామన్నారు. పెంటపాడు మండల ఎంపీటీసీలు దేవాబత్తుల నాగమణి, తోట నిరీక్షణరావు, దెయ్యం శ్రీనివాసరావు, సీహెచ్ శారద, కె.దేవికారాణి, డి.సత్యనారాయణ, బొచ్చెల తాతారావు, నంద్యాల వెంకన్నబాబుకు ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో మంత్రి కందుల దుర్గేశ్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కండువా కప్పి జనసేనలోకి ఆహ్వానించారు.

చిన్న వెంకన్నను దర్శించుకున్న మంత్రి దుర్గేశ్



శ్రీవారు, అమ్మవార్ల చిత్రపటాన్ని అందుకున్న మంత్రి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామిని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ శుక్రవారం దర్శించారు. ఆయనకు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో ప్రదక్షిణల అనంతరం బంగారువాకిలి గుండా స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు ఆయనకు స్వామి వారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ ఈవో మూర్తి మంత్రి దుర్గేశ్‌కు స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.



రంగస్థల నటి మాధవికి మహానటి సావిత్రి పురస్కారం అందిస్తున్న నిర్వాహకులు

అలరించిన హక్కు, దేవరాగం నాటికలు

రంగస్థల నటీమణి మాధవికి సావిత్రి స్మారక పురస్కారం

భీమవరం అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భీమవరం కళరంజని నాటక అకాడమి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి తెలుగు నాటిక పోటీలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. శ్రీసోమేశ్వర, జనార్ధన స్వామివార్ల ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న నాటిక పోటీలో మూడో రోజు శుక్రవారం రాత్రి రెండు నాటికలు ప్రదర్శించారు. ముందుగా హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ రంగస్థల నటీమణి ఎస్.మాధవికి మహానటి సావిత్రి స్మారక పురస్కారం, మంజునాథ్‌కు కళారంజని యువతేజం పురస్కారం అందించారు. సమాజంలో కుటుంబాలు, ప్రేమ, ఆదరణ కన్నా అస్థిరంగా ఉండే ఆస్తుల కోసం హక్కుల కోసం కుటుంబాల మధ్య జరుగుతున్న సంఘర్షణల ప్రతిరూపంగా సాగిన సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాద్ వారి హక్కు నాటిక, వృద్ధాప్యంలో తల్లిదండ్రులను కంటికి రెప్పలా కనిపెట్టుకుని ఉంటే తల్లిదండ్రులకు మధురమైన మలిదశ అవుతుందని చాటిన సౌజన్య కళాస్రవంతి ఉత్తరాంధ్ర వారి దేవరాగం నాటికలు అలరించాయి. నటీనటులు హావభావాలతో అందరినీ ఆకర్షించారు. ఈ పోటీలలో నాటక పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్, గౌరవాధ్యక్షుడు నల్లం వెంకట కృష్ణ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంటే పూర్ణ చంద్రరావు, మల్లుల సీతారామ ప్రసాద్, గుండా రామకృష్ణ, తదితర ప్రముఖులు, అధిక సంఖ్యలో ప్రేక్షకులు పాల్గొన్నారు.

టీచర్ల సంఖ్య నిర్ధారణకు సమావేశం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల పునర్వ్యవస్థీకరణలోభాగంగా జూన్ నుంచి ప్రారంభించనున్న ఐదు రకాల బడులకు బోధనా సిబ్బంది ఖరారుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 48 మండలాల్లో పాఠశాలలకు టీచర్ల కేడర్ స్ట్రెంగ్త్‌ను నిర్ధారించేందుకు శుక్రవారం ఏలూరు సుబ్బమ్మదేవి మునిసిపల్ హైస్కూలులో ఎంఈవోలతో డీఈవో వెంకటలక్ష్మమ్మ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పశ్చిమ గోదావరి, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల నుంచి ఎంఈవోలు హాజరయ్యారు. విద్యార్థుల రోల్‌ను బట్టి ఉపాధ్యాయుల సంఖ్యను నిర్ధారించారు. తుది నివేదికను శనివారం ప్రభుత్వానికి పంపించనున్నారు. దీని ఆధారంగా పాఠశాలలు, సబ్జెక్టులవారీగా టీచర్లు, సర్‌ప్లస్ టీచర్ల పోస్టులను గుర్తించి త్వరలో జరుగనున్న సాధారణ బదిలీలకు వేకెన్సీల జాబితా ఖరారు చేస్తారు.

ఉద్యాన వర్సిటీ ఉద్యోగుల జీతాలు త్వరలో చెల్లిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాడేపల్లిగూడెం రూరల్ ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన విశ్వ విద్యాలయ ఉద్యోగుల జీతాలు త్వరలో చెల్లిస్తామని రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు అన్నారు. 'జీతాలు లేవు' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. బడ్జెట్ విడుదలలో శాఖాపరమైన సమస్య కారణంగా మార్చి, ఏప్రిల్ జీతాలు మే మొదటి వారంలో వారి ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఫిబ్రవరి జీతం చెల్లించినా సీఎఫ్ఎంఎస్‌లో ఇబ్బంది వల్ల జనవరి జీతం ఇవ్వలేకపోయామన్నారు. మే మొదటి వారంలో ఏప్రిల్‌తో పాటు జనవరి, మార్చి జీతాలు జమ చేస్తామని తెలిపారు. సెక్యూరిటీ గార్డ్ పోస్టులు సీఎఫ్ఎంఎస్‌లో అనుమతి లేని కారణంగా వారి జీతాలు అందించలేకపోయామన్నారు. ప్రభుత్వ అనుమతి వచ్చే వరకు యూనివర్సిటీ ఫండ్ నుంచి అందించే ఏర్పాటు చేస్తామని తెలిపారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థుల స్టైఫండ్ జనవరి 2025 వరకూ సీఎఫ్ఎంస్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడానికి అనుమతి లభించలేదని త్వరలో చెల్లించేందుకు చూస్తామని వివరించారు.

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సొసైటీల్లో బినామీ రైతుల ఏరివేతకు ఈకేవైసీ చెక్ పెట్టనుంది. ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలోని పశ్చిమ, తూర్పు, ఏలూరు జిల్లాల్లోని 258 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) వ్యక్తిగత వివరాలతో ఈకేవైసీ కొలిక్కి తెస్తున్నారు.

ఈకేవైసీతో బినామీలకు చెక్



- సహకార సంఘాల్లో 80 శాతం పైగా పూర్తి
- త్వరలో బినామీలు, డెత్ కేసుల్లో నకిలీల ఏరివేత
- ఇకపై అర్హులకే ఓట్లు

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

ఏలూరు కేంద్ర బ్యాంకు పరిధిలోని 80 శాతం పైగా ఈకేవైసీ పూర్తి కావడంతో రాబోయే ఎన్నికలకు సభ్యత్వం ఉన్న వారే ఓటర్లు కానున్నారు. సొసైటీల్లో రైతుల కింద రూ.300 సభ్యత్వంతో నమోదు చేయించుకుని బినామీలు రుణాలను అడ్డగోలుగా తీసుకునేవారు. వీరి సంఖ్యపై ఒకప్పుడు ఎన్నో ఆరోపణలు ఉండేవి. తాజాగా సొసైటీల కంప్యూటరీకరణతో వారి సంఖ్యపై స్పష్టత వస్తోంది. ఈ నెలాఖరుకు మరణించిన వారు, బినామీలను తొలగించనున్నారు. దీనిపై సహకర శాఖ అధికారుల కసరత్తులు చేస్తున్నారు.

4.39 లక్షలకు 3.64 లక్షలు పూర్తి

- ఉమ్మడి జిల్లాలో 4,39,839 మంది రైతులు సభ్యులుగా ఉన్నారు. ఇందులో 3,64,167 మంది రైతుల ఖాతాలను ఈకేవైసీ చేశారు. 70,432 మందికి ఇంకా పూర్తిచేయాలి.
- ఏలూరు జిల్లాలో 1,68,895 మందికి 1,39,243 మందికి పూర్తిచేశారు. 29,612 మంది ఖాతాల లెక్కలు తేలాలి.
- పశ్చిమలో 1,54,849 మందికి 1,26,956 మందికి పూర్తి చేయగా, ఇంకా 27,893 మంది రైతులకు ఈకేవైసీ చేయాలి.
- తూర్పులో 1,16,895 మందికి గాను 97,968 మందికి పూర్తయ్యాయి. ఇంకా 18,276 మంది రైతులు మిగిలారు.

కమిటీల ఎన్నిక ఎప్పుడు ?

గతంలో రూ.10 వాటాధనం చెల్లిస్తే సరిపోయేది. 2020లో రూ.300 వాటా ధనంగా నిర్దేశించారు. అప్పటికే మెజారిటీ సభ్యులకు రూ.10 వాటా ధనం ఉండగా, వారు మిగిలిన మొత్తాన్ని చెల్లిస్తేనే సభ్యత్వం ఉంటుందని చెప్పడంతో కొందరు చెల్లించారు. కొత్తగా సభ్యత్వం పొందడానికి కొన్ని నిబంధనలు విధించడంతో అనధికారిక సభ్యులు సంఖ్య తగ్గుతూ వచ్చింది. సొసైటీలకు 2013లో చివరిసారిగా ఎన్నికలు జరిగాయి. 2018లో కాల పరిమితి తీరిపోవడంతో ఆరు నెలల చొప్పున ఏడాది వరకు పాత పాలకవర్గాలు కొనసాగుతూ వచ్చాయి. ఈ స్థానంలో వైసీపీ ప్రభుత్వం నామినేటెడ్ కమిటీలను నియమించింది. 2019 ఆగస్టులో త్రిసభ్య డీసీఎంఎస్, డీసీబీబీకి ఏడుగురు సభ్యుల కమిటీలు ఏర్పాటయ్యాయి. ఆరు నెలలకు ఒకమారు కాల పరిమితి పొడిగిస్తూ ఈ కమిటీలను కొనసాగించారు. కమిటీ స్థానంలో తెలుగుదేశం ప్రభుత్వం పర్సన్ ఇన్‌ఛార్జులను నియమించింది. ఈకేవైసీపై జిల్లా సహకార అధికారి ఆరిమిల్లి శ్రీనివాస్‌ను వివరణ కోరగా నెలాఖరు నాటికి ఈకేవైసీ పూర్తి చేయడానికి సిద్ధంగా ఉన్నామని వివరించారు. బినామీ రైతులను తొలగించేందుకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సభ్యులయ్యేందుకు..

- సహకార సంఘాల్లో సభ్యులు కావాలంటే తొలుత రైతుగా గుర్తింపు పొందాలి.
- కనీసం పది సెంట్ల భూమి కలిగి ఉండాలి.
- ఏడాదిపాటు సొసైటీలో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలి.
- అప్పు తీసుకోవడం లేదా డిపాజిట్ చేయాలి.
- బకాయిదారునిగా ఉండకూడదు.
- ఎన్నికల ప్రకటనకు 30 రోజుల ముందు సభ్యత్వం తీసుకోవాలి.

ప్రజా రక్షణకే పోలీసులు

ఐజీ అశోక్ కుమార్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పోలీసులు ప్రజా రక్షణకు కట్టుబడి ఉంటారని ఏలూరు రేంజ్ ఐజీ జీవిజీ అశోక్‌కుమార్ అన్నారు. జిల్లా వ్యాప్తంగా గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకూ అన్ని ప్రధాన రహదారులపై పోలీసులు నాకా బందీ నిర్వహించారు. ఏలూరు పాత బస్టాండ్ వద్ద వాహనాల తనిఖీ తీరును ఐజీ అశోక్‌కుమార్ పరిశీలించారు. ఎస్పీ కేపీఎస్ కిశోర్ స్వయంగా వాహనాల తనిఖీల్లో పాల్గొన్నారు. ఐజీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసుల ప్రధాన లక్ష్యం కేవలం నేరాలను నివారించడమే కాదని ప్రజలందరికి సురక్షిత వాతావరణాన్ని కల్పించడమేనన్నారు. ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ భవిష్యత్‌లో నాకా బందీ కార్యక్రమాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తామని కట్టుదిట్టమైన చర్యలు చేపడతామన్నారు. ప్రజల సహకారంతో జిల్లాలో మత్తుపదార్థాల నివారణ, శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రజల భద్రత, నేరాలను నియంత్రించడం, నైతిక పోలీసింగ్‌ను ప్రోత్సహించడం లక్ష్యంఅన్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.



ఏలూరులో వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ తనిఖీ



జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఐజీ అశోక్ కుమార్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీలలో భాగంగా జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఐజీ అశోక్‌కుమార్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో దస్త్రాలను ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం పట్టణం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, క్రైం రేటు కూడా పెరుగుతుందన్నారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై పోస్టు త్వరలో భరీ చేస్తామని, సిబ్బందిని నియమిస్తామన్నారు. చింతలపూడి, జంగారెడ్డిగూడెంలో పోక్సో కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయని, చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో ఐజీ, ఎస్పీ కె.ప్రతాప్ కిశోర్ మొక్కలు నాటారు. డీఎస్పీ యు.రవిచంద్ర, సీఐ కృష్ణబాబు, ఎస్సైలు జబీర్, శశాంక, కుటుంబరావు పాల్గొన్నారు.

● కామవరపుకోట: పోలీసులు అంకితభావంతో విధులు నిర్వహించాలని ఐజీ అశోక్‌కుమార్ అన్నారు. ఎస్పీ ప్రతాప్ కిశోర్‌తో తడికలపూడి పోలీసుస్టేషన్ సందర్శించారు. రికార్డులు పరిశీలించి కేసుల పరిష్కారంపై పోలీసు సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి నిఘా పెంచాలని, గంజాయి, మత్తు పదార్థాల రవాణా అరికట్టాలన్నారు. స్టేషన్ ప్రాంగణంలో ఐజీ మొక్కలు నాటారు. వారి వెంట జంగారెడ్డిగూడెం డీఎస్పీ రవిచంద్ర. ఎస్ఐ పి. చిన్నారావు, ఏఎస్ఐ వీరాస్వామి, రైటర్ సుధీర్ తదితరులు ఉన్నారు.



మృదుల కుమారికి పురస్కారం, సత్కారం

మూర్తి రాజు ఆశయాలు నెరవేరుద్దాం

సర్వోదయ ఆవిర్భావ దినోత్సవంలో వక్తలు

ఉంగుటూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): దివంగత మూర్తిరాజు ఆశయాలను నెరవేరుద్దామని పలువురు వక్తలు అన్నారు. నాచుగుంట సర్వోదయ నగర్‌లో శుక్రవారం జరిగిన సర్వోదయ మండలి 65వ ఆవిర్భావ కార్యక్రమంలో గాంధేయవాదులు, స్వాతంత్ర్య సమర యోధులు మాట్లాడారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా సర్వోదయ స్ఫూర్తి అవార్డును చర్లవిధుల కుమారికి మరణానంతరం ఆమె సోదరి మృదుల కుమారికి అందించారు. స్త్రీ శక్తి అవార్డును బోయపాటి రామలక్ష్మికి అందించారు. సభలో మూర్తిరాజు జీవిత చరిత్ర అనగనగా ఒక రాజు- మూర్తిరాజు పేరిట ఎస్ఎస్ఎల్.రాజు రచించిన పుస్తకావిష్కరణ జరిగింది. వెంపరాల సూర్యనారాయణమూర్తి, జల్లా వీరభద్రరావు, సాగిరాజు జానకి రామరాజు, కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, జిల్లా సర్వోదయ మండలి ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, బొడ్డేపల్లి అప్పారావు, గట్టిం మాణిక్యాలరావు, ఆర్‌వీఎస్.రాజు, సర్పంచ్ బండారు సింధు, అడపా శోభారాణి, ఎంపీపీ గంటా పాల్గొన్నారు.

నరసాపురం నగల దుకాణాల్లో విజిలెన్స్

స్టాక్, తూకం అవకతవకలు గుర్తింపు.. జరిమానా

ఏలూరు క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బంగారు షాపుల్లో అక్రమంగా విక్రయాలు జరుగుతున్నాయని, ధ్రువీకరణ లేని ఎలక్ట్రానిక్ కాటాలను వినియోగిస్తున్నారని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంటు అధికారి వి.శ్రీరాంబాబుకు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐ వి.శివరామకృష్ణ, ఎస్ఐ కె.సీతారామ్, తూనికలు, కొలతల అధికారి రాంబాబు, జీఎస్టీ అధికారి ఎ.శ్రీనివాసరావు, సిబ్బంది నరసాపురంలోని రెండు షాపుల్లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. శ్రీజైన్ జ్యూవెల్ పార్కులో తనిఖీలు చేసి 622.37 గ్రాముల బంగారం, నాలుగు కేజీల 907 గ్రాముల వెండి వస్తువులు స్టాక్ రిజిస్టర్ కన్నా తక్కువ ఉన్నట్లు గుర్తించారు. జీఎస్టీ అధికారులు రూ.3,51,004 అపరాధ రుసుము విధించారు. ధ్రువీకరణ లేని ఎలక్ట్రానిక్ కాటాను గుర్తించి తూనికలు కొలతల అధికారులు రూ.25 వేల అపరాధ రుసుము విధించారు. జై అంబికా సంపవి జ్యూవెలర్స్‌లో తనిఖీ చేసి ధ్రువీకరణ లేని ఎలక్ట్రిక్ కాటాను గుర్తించారు. రూ.25 వేల అపరాధ రుసుము విధించారు. విజిలెన్స్ అధికారులు బంగారు షాపులపై తనిఖీలు చేస్తున్నారని తెలియడంతో కొన్ని షాపుల వారు శుక్రవారం మూసివేశారు.



తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ద్వారకా నగర్‌లో చోరీ

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగులకొట్టి చోరీకి తెగబడ్డారు. బీరువాలోని బంగారు వస్తువులను అపహరించారు. మండలంలోని ఎం నాగులపల్లి పంచాయితీ ద్వారకానగర్‌లో జరిగిన చోరీపై కేసు నమోదైంది. ఎస్ఐ సుధీర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన చేకుర్తి పవన్‌కుమార్ ఈనెల 16న సాయంత్రం ఇంటికి తాళాలు వేసి కుటుంబంతో కలసి దేవులపల్లిలో పంక్షన్‌కు వెళ్లాడు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బీరువాలో బంగారు చైన్, ఉంగరం, బ్రాస్‌లెట్‌లను తస్కరించినట్లు తిరిగి ఇంటికి వచ్చిన యజమాని ఈనెల 17న గుర్తించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యార్థినులతో అసభ్యకర ప్రవర్తన

పోక్సో కేసు నమోదు

పెదపాడు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతిగృహ వార్డెన్ విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతడిపై పెదపాడు పోలీసులు శుక్రవారం పోక్సో కేసు నమోదు చేశారు. జడ్పీ హైస్కూల్ ఆవరణలో ఎస్సీ బాలికల వసతిగృహం శిథిలా వస్థకు చేరుకోవడంతో హైస్కూల్ ఆడిటోరియంలో వసతిగృహాన్ని నిర్వహిస్తున్నారు. వార్డెన్ ప్రతిరోజూ ఏలూరు నుంచి హాస్టల్‌కు కారులో వచ్చి వెళుతున్నారు. కారు డ్రైవర్ శీలం ప్రసాద్ ఈనెల 14న ఒక విద్యార్థిని కారులోకి లాగి అసభ్యకరంగా ప్రవర్తించాడని వార్డెన్ దృష్టికి తీసుకెళ్లింది. ఈ సంఘటనపై ఆరా తీయగా మరో ఇద్దరు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు వార్డెన్‌కు తెలిపారు. దీనితో వార్డెన్ విప్పర్తి విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోక్సో కేసు నమోదు చేసి నట్లు ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో

యువకుడి మృతి

భీమవరం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న బైక్ వ్యాన్‌ను ఢీకొనడంతో ఒక యువకుడు మృతి చెందాడు. రూరల్ ఎస్ఐ వీర్రాజు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన అడ్డాల చిన్న (24) హైదరాబాద్‌లో జిమ్ కోచ్‌గా పని చేస్తున్నాడు. గురువారం హైదరాబాద్ నుంచి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి బయలుదేరాడు. భీమవరం మండలం లోసరి గ్రామం వద్ద హైవేపై వ్యాన్‌ను ఢీకొట్టి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతని సోదరుడు దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్స పొందుతూ..

ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. రూరల్ హెడ్ కానిస్టేబుల్ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 16న దిరుసుమర్రులో బర్రె శ్రీనివాస్ (52) ద్విచక్ర వాహనంపై వెళుతున్నాడు. అదే గ్రామానికి చెందిన నన్నేటి ప్రసాద్ ద్విచక్ర వాహనంపై వస్తూ శ్రీనివాస్ వాహనాన్ని ఢీకొట్టాడు. అతడికి తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వెంకటరెడ్డి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉండిలో గంజాయి స్వాధీనం

11మంది అరెస్ట్

ఉండి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఉండి శివారు ఉప్పుగుంట రోడ్డులో డంపింగ్‌యార్డు వద్ద గంజాయి ముఠా సమాచారంతో ఎస్ఐ నజీరుల్లా ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ముఠాపై దాడి చేసి 1650 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 11 మందిని అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మెగా గుండె వైద్య శిబిరం

నరసాపురం రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ సేవా కార్యక్రమంలో భాగంగా రుస్తుంబాదాలోని ఐటీఐ కాలేజీలో మెగా గుండె వైద్య శిబిరం నిర్వహించారు. విప్ నాయకర్, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి ప్రారంభించారు. విజయవాడ హెల్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆధునిక వైద్య పరీక్షలను ఉచితంగా అందించారు. డాక్టర్ ప్రకాష్, నార్ని తాతాజీ, మునికోటి వెంకటేశ్వరావు

వారసత్వ సంపద దేశ సమగ్రతకు దోహదం

తణుకు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వారసత్వ సంపద ప్రజల మధ్య సాన్నిహిత్యం పెంపు, దేశ సమగ్రతకు సహకరించే సాధనమని సామాజిక వేత్త డీవీవీఎస్ వర్మ అన్నారు. సజ్జాపురం సీనియర్ సిటిజన్స్ సంఘ కార్యాలయంలో శుక్రవారం వరల్డ్ హెరిటేజ్ డే నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు ఈదర ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వర్మ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సమన్వయకర్త అడ్డాల సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

మూడో అదనపు జిల్లా జడ్జి సోమశేఖర్ బదిలీ



భీమవరం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు ఉత్తర్వుల మేరకు భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా సంస్థ ఛైర్మన్‌గా పనిచేస్తున్న ఎంఏ సోమశేఖర్‌ను నెల్లూరు 8వ అదనపు జిల్లా జడ్జి, మహిళా కేసుల నేర విచారణ ప్రత్యేక కోర్టుకు బదిలీ చేశారు. ఆయన తన బాధ్యతలను భీమవరం పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి గౌరవ డాక్టర్ బి. లక్ష్మీనారాయణకు అప్పగించాల్సిందిగా హైకోర్టు ఉత్తర్వులిచ్చింది.



జ్యోతి ప్రజ్వలన చేసి సినిమాస్‌ను ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి, ధర్మరాజు తదితరులు

శ్రీశ్రీ కాన్‌ప్లెక్స్ సినిమాస్ ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో మల్టీప్లెక్స్ థియేటర్స్ శ్రీశ్రీ కాన్‌ప్లెక్స్ సినిమాస్‌ను శుక్రవారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ఆయనతోపాటు పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు, మద్దిపాటి వెంకటరాజు, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి, జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, నాయకులు కరాటం రాంబాబు, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ తదితరులు పాల్గొని థియేటర్స్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వర్మ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రకాలుగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఔత్సాహికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రోత్సహిస్తోందన్నారు. తాడేపల్లిగూడెంలో మూడు థియేటర్స్ ఒకే చోట ఏర్పాటు పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సినీ ప్రేమికులకు వినోదం సరసమైన ధరలకు అందేలా చూడాలని సూచించారు. నిర్వాహకులు గన్నమని శ్రీనివాస్ (శ్రీశ్రీ డెంటల్), చలంచర్ల హరిప్రసాద్, నారాయణ వెంకట రమణరావు, చలంచర్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో విజుబుల్ పోలీసింగ్



భీమవరం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గురువారం రాత్రి 9 నుంచి 11 గంటల వరకు విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి స్వయంగా భీమవరం బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో తనిఖీల్లో పాల్గొన్నారు. ప్రజలు సైతం తమ చుట్టుపక్కల ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రతి పౌరుడు భాగస్వామిగా ఉన్నప్పుడు సమాజం నేరరహితంగా మారుతుందని అన్నారు భీమవరం డీఎస్పీ ఆర్.జయసూర్య, జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వి.పుల్లారావు, భీమవరం వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ ఎం.నాగరాజు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

తణుకు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ వర్తించని కొన్ని వ్యాధులకు సంబంధించి వైద్యం చేయించుకున్న వారిని ఆదుకోవాలనే లక్ష్యంతో సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ చెప్పారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని 8 మందికి రూ. 9.73 లక్షల విలువైన చెక్కులను అందజేసారు. కారుమూరి స్వగ్రామమైన అత్తిలికి చెందిన తలారి ప్రసాదు గత వైసీపీ ప్రభుత్వంలో సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే కనీసం దరఖాస్తు ఎక్కడుందో తెలియని పరిస్థితిలో వారు ఉన్నారని, కూటమి ప్రభుత్వం వచ్చాక అతనికి రూ. 5 లక్షల అందించామని గుర్తు చేశారు.

రోడ్లపై చెత్త వేయవద్దు

చెత్తను రహదారులపై వేయవద్దని ఎమ్మెల్యే ఆరిమిల్లి అన్నారు. శుక్రవారం ఉదయం 24వ వార్డులో పారిశుధ్య పనులను మున్సిపల్ అధికారులతో కలసి పర్యవేక్షించారు. ఇంటింటికి వచ్చే సిబ్బందికే చెత్తను ఇవ్వాలని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దళితులకు అండగా టీడీపీ

భీమవరం అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం దశాబ్దాలుగా పోరాడుతున్న దళితులకు టీడీపీ అండగా నిలిచిందని ఆ పార్టీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు కేబినెట్ ఆమోదం తెలపడంపై భీమవరం నియోజకవర్గ ఎస్సీ సెల్ నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎద్దు ఏసుపాదం, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు యాళ్ల వెంకటేశ్వరరావు, ఆనపర్తి కృష్ణప్రసాద్, జిల్లా ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బండి రాజేష్, ఎస్సీ నాయకులు మందకృష్ణ మాదిగకు, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కు ధన్యావాదాలు తెలిపారు.

మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు భేష్



భీమవరం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్ర జ్యోతి): వేసవిలో బాటసారుల కోసం మజ్జిగ చలివేంద్రాల ఏర్పాటు అభినందనీ యమని ఎమ్మెల్యే అంజిబాబు అన్నారు. భీమవరం జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ఆలయ ధర్మకర్త, చైర్మన్ మంతెన రామ్ కుమార్ రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు మాట్లాడుతూ దంతులూరి జగన్నాధరాజు 4వ కుమార్తె అల్లూరి సూరయమ్మ వేసవిలో బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం నిమిత్తం 3.94సెంట్లు భూదానం చేసారని, దాత ఆశయాల మేరకు వేసవిలో ప్రతిరోజు 40 లీటర్ల మజ్జిగ, మంచినీళ్ల ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

జూనియర్ లెక్చరర్ల సంఘం ఎన్నిక

తణుకు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల సంఘం ఎన్నికలు శుక్రవారం ఎస్సీఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంవీఆర్ దేవరాజు, ఉపాధ్యక్షుడిగా బి.వాయు నందనరావు, కార్యదర్శులుగా వి.పద్మావతి, కె.అన్నవరం, సంయుక్త కార్యదర్శిగా ఎల్. శ్రీనివాసు, కోశాధికారిగా కె.మురళీకృష్ణ, మహిళా కార్యదర్శిగా ఎం.జబీన్, స్టేట్ కౌన్సిలర్‌గా వి.నాగమణిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి గురుజుదత్త హనుమాన్ ప్రకటించారు.

కాంగ్రెస్ నేతల దిష్టిబొమ్మల దహనం

భీమవరం టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత కాంగ్రెస్ పాలన అంతా అవినీతి కుంభ కోణాలమయం.. మోదీ అవినీతిలేని పాలన సాగిస్తున్నారని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కలిదిండి వినోద్ వర్మ అన్నారు. భారతీయ జనతా యువమోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో భీమవరం ప్రకాశం చౌక్ వద్ద కాంగ్రెస్ పార్టీ అగ్రనేతల నేషనల్ హెరాల్డ్ స్కాం, మనీ లాండరింగ్ కేసులో ఈడి చార్జీషీట్ ఫైల్ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు సోనియా, రాహుల్ దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన తెలిపారు.

గ్రంథాలయానికి కుర్చీల వితరణ

ఆచంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): ఆచంట శాఖా గ్రంథాలయానికి దాతల సహకారంతో సమకూర్చిన 14 కుర్చీలను శుక్రవారం లైబ్రేరియన్‌కు మానవత సభ్యులు అందజేశారు. దాతలను మానవత సభ్యులు అభినందించారు. మానవత మండల అధ్యక్షుడు కుక్కల లీలా ప్రసాద్, కొల్లేపర వెంకన్నబాబు, వేంద్ర శ్రీనివాస్, గుండాబత్తుల ఆనంద కుమార్ పాల్గొన్నారు.



క్రీస్తుకు పూలమాల వేస్తున్న ఆరిమిల్లి



బలుసుమూడి చర్చిలో ప్రార్థనలు



శిలువ మోస్తూ ర్యాలీలో పాల్గొన్న విప్ నాయకర్



గణపవరం వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పత్సమట్ల

క్రీస్తు బోధనలు ఆచరణీయం

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే ● చర్చిల్లో ప్రార్థనలు ● శిలువ మోస్తూ ర్యాలీలు



ఆకివీడులో ర్యాలీ.. (ఇన్‌సెట్) శిలువ మోస్తున్న భక్తురాలు



శృంగవృక్షంలో శిలువతో ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్సీఎం సంఘస్థులు

తణుకు/రూరల్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): క్రీస్తు బోధనలు ఆచరణీయమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా పట్టణంలోని ఆర్‌సీఎం చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన మాట్లాడారు. శిలువకు పూలమాల వేశారు. అనంతరం శిలువను ఊరేగించారు. మండలంలోని వేల్పూరులో సెయింట్ లూథరన్ చర్చి, వీరభద్రపురంలోని జీడీఎం, పెంతెకోస్తు, దువ్వ లోని రక్షణ సైన్యం తదితర చర్చిలలో విశ్వాసులు గుడ్ ఫ్రైడే ప్రార్థనలు నిర్వహించారు.

తాడేపల్లిగూడెం రూరల్: పట్టణంలోని లూథరన్ చర్చి, సెయింట్ మదర్ వన్నీని చర్చి వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. మదర్ వన్నీని పాస్టర్ రెవరెండ్ జోసెఫ్ అర్జున్ ఆధ్వర్యంలో శిలువతో పట్టణంలో ర్యాలి నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ పాస్టర్ ప్రేమ్‌కుమార్, పాస్టర్‌లు పాల్గొన్నారు.

పెంటపాడు: మండలంలోని ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏసుక్రీస్తు చేసిన త్యాగంపై పాస్టర్లు వివరించారు.

నరసాపురం టౌన్: గుడ్ ఫ్రైడేని తీర ప్రాంతంలో శుక్రవారం క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉపవాసాలు ఉన్నారు. చర్చిల్లో ప్రార్థనలు జరిపారు. మిషన్‌హైస్కూల్ రోడ్‌లోని ఆర్‌సీఎం చర్చి నిర్వహించిన ర్యాలీలో శిలువ మోస్తూ ప్రభుత్వ విప్ నాయకర్ పాల్గొన్నారు. త్యాగానికి ప్రతీక గుడ్‌ఫ్రైడే అన్నారు. పాస్టర్లు గుడ్‌ఫ్రైడే విశిష్టతను వివరించారు.

పాలకొల్లు అర్బన్: శంభునిపేట క్రీస్తు లూథరన్ చర్చిలో గుడ్‌ఫ్రైడ్ విశిష్టతను పాస్టర్లు తెలిపారు. ఏసు ప్రేమ తత్వాన్ని కలిగి ఉండాలని పాస్టర్ దీపక్ సూచించారు. ఏసు శిలువపై పలికిన ఏడు మాటలపై రెవరెండ్ కె. సాల్మన్ చక్రవర్తి తెలియజేయగా డాక్టర్ కొల్లాబత్తు ఫ్రెడ్రిక్ పరదేశిబాబు ప్రేమ తత్వాన్ని, క్రైస్తవులు ఏ విధంగా ఆచరించాలో తెలిపారు. డెలిగేట్ కె సుదర్శన్‌కుమార్, కోశాధికారి పీతల ఆనందకుమార్ తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: బలుసుమూడిలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. పేరిష్ పాస్టర్ అబ్రహం లింకన్ మాట్లాడుతూ ఏసు సర్వ మానవాళిని పాపం నుంచి రక్షించుటకు తాను శిలువపై ప్రాణాలు విడిచిపెట్టారని అన్నారు.

పాలకోడేరు: శృంగవృక్షంలో గల విచారణ ఆర్‌సీఎం చర్చి సంఘస్తులు ఫాదర్ రెవరెండ్ తోట గాబ్రియేల్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఫాదర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్షమాగుణం కలిగి ఉండి ప్రభువైన ఏసుక్రీస్తు చెప్పిన ఏడు మాటలను ఆచరించి పరలోక రాజ్యానికి బాటలు వేసుకోవాలన్నారు. సర్పంచ్ జంగం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గల చర్చిలలో సంఘ విశ్వాసులు ఉదయం నుంచి ప్రత్యేక ఉపవాస ప్రార్థనలలో పాల్గొన్నారు.

కాళ్ళ: మండలంలోని లూథరన్, ఆర్‌సిఎం, మన్నా తదితర చర్చిల్లో గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

ఉండి: ఉండి, ఎన్‌ఆర్‌పి అగ్రహారం, చెరుకువాడ, మహదేవపట్నం, కోలమూరు, వాండ్రం, పాందువ్వ, ఉణుదుర్రు, యండగండి, చిలుకూరు తదితర గ్రామాల్లోని చర్చిల్లో ప్రార్థనలు జరిగాయి.

ఆకివీడు: క్రైస్తవులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మండుటెండలో ర్యాలీగా శిలువ మోస్తూ ప్రత్యేక గీతాలు ఆలపించారు.

పెనుమంట్ర: పొలమూరు లూథరన్ చర్చిలో గుడ్‌ఫ్రైడే వేడుకలు ఘనంగా జరిగాయి. పొలమూరు లూథరన్ చర్చి ప్యారిస్ పాస్టర్ వి.నోబుల్ మాట్లాడుతూ దయ, జాలి, కరుణ, ప్రేమ క్షమాగుణం కలిగి ఉండాలని క్రైస్తవులకు సూచించారు.

గణపవరం: క్రీస్తు బోధనలు సర్వమానవాళికి ఎంతో ఉపయోగకరమని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. గుడ్‌ఫ్రైడే సందర్భంగా గణపవరంలో బైబిల్‌మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ర్యాలీలో పాల్గొన్నారు. క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి వాసురాజు, జనసేన నాయకులు వంగా రఘు, తోట శ్రీనివాసరావు, గాదిరాజు ఈశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సహకారంతో ఎత్తిపోతల నిర్మాణం

కొత్తపాలెంలో సస్యశ్యామలం కానున్న 250 ఎకరాలు ఆయకట్టు



ఎత్తిపోతల పథకం ప్రారంభిస్తున్న సర్పంచ్

మొగల్తూరు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): సాగునీరందక, అందుబాటులో ఉన్న గొంతేరు డ్రెయిన్‌లోని నీటిని చేలల్లోకి తోడుకోవడం సాధ్యం కాక ఆ గ్రామంలో 250 ఎకరాల ఆయకట్టు సాగుకు దూరమైంది. గడచిన పంచాయతీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీ మేరకు కొత్తపాలెం సర్పంచ్ లోకం నాగలక్ష్మీ వెంకటేశ్వరరావు (నాని)ముందుకు వచ్చారు. గ్రామంలోని గొంతేరు డ్రెయిన్‌లోని నీటిని వరి చేలు, ఆక్వా చెరువుల్లోకి లిఫ్ట్ చేసుకోవడానికి ప్రత్యేక విద్యుత్ కనెక్షన్‌ను ఏర్పాటు చేశారు. గ్రామంలోని సుమారు 250 ఎకరాలకు సంబంధించి డ్రెయిన్ నుంచి గ్రామంలోకి వచ్చే బోదెకు పైపులు రెండు అమర్చి విద్యుత్ కనెక్షన్ ఇచ్చారు. ఖర్చుల్లో రూ.3 లక్షలు సర్పంచ్ నాగలక్ష్మీ వెంకటేశ్వర రావు విరాళంగా ఇచ్చారు. మిగిలిన సొమ్ము రైతులు చందాలు వేసుకుని స్వచ్ఛందంగా లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్ బిల్లు రైతులు కట్టుకునే విధంగా గ్రామస్థులు అంగీకారానికి వచ్చి ఈప్రక్రియను ఏర్పాటు చేసుకున్నారు. స్వచ్ఛందంగా ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకాన్ని సర్పంచ్ శుక్రవారం ప్రారంభించారు.



ఆస్పత్రిని తనిఖీ చేసిన జేసీ

భీమవరం క్రైం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రోగులకు మెరుగైన చికిత్సను అందించడంతో పాటు ఆసుపత్రి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం భీమవరం ఏరియా ఆస్పత్రిని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి ఆస్పత్రిలో పరిసరాలు పరిశీలించారు. పారిశుధ్య పనుల నిర్వహణలో ఎటువంటి అలసత్వం ఉన్నా సహించేది లేదని హెచ్చరించారు. భోజనం సదుపాయాలు ఎలా ఉన్నాయని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. ఆపరేషన్లు చేసిన తర్వాత డాక్టర్లు అందించే వైద్య సదుపాయాలు ఎలా ఉన్నాయి? ప్రతిరోజు వచ్చి చెకప్ చేస్తున్నారా అని ఆరా తీశారు. టాయిలెట్స్ ప్రతిరోజు క్లీన్ చేయాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. డాక్టర్ జి.మాధవి కళ్యాణి, ఆర్‌ఎంకె ప్రవీణ్ కుమార్ తదితరులు ఉన్నారు.

ఆక్రమణల తొలగింపు

నరసాపురం రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వైఎస్ పాలెం తెలగంశెట్టిమెరకలో రహదారిపై ఇష్టానుసారంగా ఆక్రమణలకు పాల్పడుతుండటంతో రహదారి కనిపించక తరుచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆక్రమణలను తొలగిస్తున్నట్లు సర్పంచ్ వైఎస్ నాగముత్యమాంబ తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

ఆచంట, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): పెదమల్లంలో డ్రెయినేజీ నిర్మాణానికి జడ్పీటీసీ సురేష్‌బాబు, ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి శంకుస్థాపన చేశారు. సర్పంచ్ విజయలక్ష్మి, డీసీ చైర్మన్ తమ్మినీడి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షుడు కేతా మీరయ్య, బీరా నరసింహమూర్తి కూటమి సభ్యులు పాల్గొన్నారు.

22న కలెక్టరేట్ ముట్టడి

పెనుగొండ, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మార్చి నెల నుంచి చెల్లించాల్సిన వ్యవసాయ కార్మికుల ఉపాధి పని వేతనాలు తక్షణం చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం పెనుగొండ మండల కార్యదర్శి షేక్ పాదుషా అన్నారు. శుక్రవారం మునమర్రులో కార్మికులను కలిసి సమస్యలు తెలుసుకున్నారు. ఈ నెల 22న కలెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జరిగే ముట్టడి కార్యక్రమం జయ ప్రదం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ కార్యదర్శి కౌరు జగన్నాథం, సీఐటీయు నాయకులు పాల్గొన్నారు.

కారుమూరి నోరు అదుపులో పెట్టుకోవాలి : ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ళు నువ్వు చేసిన రాజకీయాన్నే నేను కూడా అనుసరిస్తా.. రాజకీయానికి రాజకీయం చేసి నేనేంటో చూపిస్తాను. అధికారంలో ఉన్నపుడు అధికార మదంతో సంస్కారం లేకుండా మాట్లాడిన మాటలు ఇంకా ప్రజలు మర్చిపోలేదు. ఖబడ్దార్ కారుమూరి... ఇంకా నేను నాలుగేళ్ళు అధికారంలో ఉంటా..పిచ్చి వేషాలు వేస్తే చూస్తూ కూర్చోను.. నువ్వు నేర్పిన రాజకీయం చేస్తా అని మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావుపై ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ తీవ్ర స్థాయిలో ఫైర్ అయ్యారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ స్వయం కృషితో ఎదిగిన వ్యక్తి కాబట్టే మంత్రి అయ్యారని, అలాంటి వ్యక్తిపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తున్న కారుమూరి టీడీఆర్ బాండ్ల అక్రమ సొమ్ముతో మంత్రి అయ్యారని విమర్శించారు. కారుమూరి తన నోటిని అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. అధికార పార్టీ నాయకులపై బురద జల్లితే ప్రజలు చూస్తు ఊరకోరన్నారు. అధికార పార్టీలో ఏమైనా తప్పులు జరిగిన ప్రతిపక్ష నాయకుడిగా సూచనలు చేయాలని, విజిటింగ్ పొలిటీషియన్‌గా నియోజకవర్గానికి వచ్చి బురద జల్లి వెళ్ళిపోతే చూస్తూ ఊరుకోమన్నారు. అబివృద్ధి, సంక్షేమం కోసం కష్టపడతానని, కారుమూరి కోసం మరో నాలుగు గంటలు కారుమూరి రాజకీయం కోసం కేటాయిస్తానని పేర్కొన్నారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయలేక.. : కారుమూరి

తణుకు రూరల్: కూటమి హామీలను అమలు చేయకుండా వైసీపీ నాయకులపై దుష్ప్రచారం చేసి కాలయాపనతో తప్పించుకుంటు న్నారని మాజీ మంత్రి కారుమూరి ఆరోపించారు. శుక్ర వారం తణుకు వైసీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ తాను అనని మాటలను అన్నట్టు కూట మి నాయకులు, కేంద్ర మంత్రి ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు.

కూటమికి చెడ్డపేరు తేను

అత్తిలి ఏఎంసీ చైర్మన్ దాసం ప్రసాద్

అత్తిలి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తాను పదవికి వన్నె తెచ్చేలా పనిచేస్తాను తప్ప కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే పనులేమీ చేయనని అత్తిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన దాసం ప్రసాద్ అన్నారు. అత్తిలిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. తనకు ఏఎంసీ పదవికి అవకాశం కల్పించిన తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, జిల్లా జనసేన అధ్యక్షుడు కోటికలపూడి గోవిందరావుకు, జనసైనికులకు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో పెద్ద ఎత్తున ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని చేపడతామన్నారు. జనసేన నాయకులు నీటి సంఘం ఉపాధ్యక్షులు బోడపాటి బాబీ, దిరిశాల తారక రాఘవేంద్రరావు, బండి దుర్గా ప్రసాద్, తిరుపతి గణేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దాసం ప్రసాద్



కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు శ్రీకర్, అఖిలకు స్వామివారి చిత్రపటాలు అందిస్తున్న ఆలయ అధికారులు

క్షీరారామంలో ఆర్డీవోల పూజలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామివారిని శుక్రవారం కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, రామచంద్ర పురం ఆర్డీవో అఖిల సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ మర్యాదలతో అధికారులు, అర్చకులు వారికి స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచన మండపంలో వారికి స్వామివారి చిత్రపటాన్ని, స్వామి వారి శేష వస్త్రాలను అందించారు. కార్యక్రమంలో ఈవో ముచ్చర్ల శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పి. వాసు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నరసాపురం రూరల్: రుస్తుంబాదాలో శుక్రవారం అంకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఎమ్మెల్యేలు నాయకర్, పితాని సత్యనారాయణ, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు పూజలు నిర్వహించారు. కొత్తపల్లి నాని, వలవల నాని, రవీంద్ర, మైలా వసంతరావు, గంటా కృష్ణలు పాల్గొన్నారు. పట్టణంలోని కొవెల గుడిలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో ప్రభుత్వ విప్ నాయకర్ పాల్గొన్నారు. ఎంతో ప్రసిద్ధిగాంచిన ఆదికేశవ ఎంబర్‌మన్నార్ ఆలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు పూర్ణకుంభంతో వేదపండితులు స్వాగతం పలికారు. ఈకార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పుప్పాల వెంకట కృష్ణారావు, ఇవో రామచంద్రకుమార్‌లు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న నాయకర్, పితాని, కొత్తపల్లి